క్లుప్తంగా

వాచ్‌మెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెన్‌పహాడ్‌: మండల పరిధిలోని అనాజీపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో గల వసతి గృహంలో వాచ్‌మెన్‌గా పనిచేయడానికి పదో తరగతి పాసైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈఓ రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35 సంవత్సరాలు నిండిన స్థానిక మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 19 లోపు పాఠశాలలోని ప్రిన్సిపాల్‌కు అందజేయాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

తుంగతుర్తి : మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాల కళాశాలలో 6, 8వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశం మంగళవారం తెలిపారు. దరఖాస్తులను ఈనెల 17 వరకు గురుకుల పాఠశాలలో అందించాలని కోరారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ మార్కులు, రిజర్వేషన్, ఖాళీల ఆధారంగా సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణ

సూర్యాపేట : సూర్యాపేట మండల పరిధిలోని బాలెంలలో అరవిందాక్ష ఇంజనీరింగ్ భవనంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ బోధించేందుకు గెస్ట్ ఫ్యాకల్టీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీల మంగళవారం తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులు, నెట్ లేదా సెట్ క్వాలిఫై, కనీసం మూడు సంవత్సరాల బోధన అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ నెల 17న ఉదయం 10 గంటలకు కళాశాలలో డెమో ఉంటుందని తెలిపారు. వివరాలకు 93983 16225, 75550 10681ను సంప్రదించాలని కోరారు.

సాగు నీరందించాలి

తుంగతుర్తి : ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి తుంగతుర్తి ప్రాంత రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని వీఎన్ భవనంలో నిర్వహించిన మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి నార్లు పెట్టేందుకు నీరు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం గోదావరి జలాలను ఎస్సారెస్పీ కాల్వల ద్వారా అందించి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శులు బుర్ర శ్రీనివాసు, కందాల శంకర్ రెడ్డి, గుమ్మడవెల్లి ఉప్పలయ్య, దేవరకొండ యాదగిరి, జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం పాల్గొన్నారు.

ట్రాక్టర్లకు సౌండ్ బాక్స్‌లు పెడితే కేసులు



అర్వపల్లిలో ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సైదులు, పోలీసులు

అర్వపల్లి: తుంగగూడెం రీచ్ నుంచి ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లకు సౌండ్ బాక్స్‌లు పెడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ఈట సైదులు అన్నారు. తుంగగూడెం నుంచి ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లను మంగళవారం అర్వపల్లిలో ఆపి వాహన పత్రాలను పరిశీలించారు. అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. ట్రాక్టర్లకు అధిక శబ్దంతో ఉన్న సౌండ్ బాక్స్‌లు పెట్టొద్దని చెప్పారు. డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చి ట్రాక్టర్లకు ఉన్న సౌండ్ బాక్స్‌లను తొలగించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రామకోటి, హెచ్‌సీలు సుధీర్, రవి, సిబ్బంది, సతీష్, సాయి, మణికుమార్, నాగయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ బిచ్చునాయక్

నాగారం : సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్ అన్నారు. మంగళవారం నాగారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బొమ్మగాని హర్షవర్ధన్, ప్రధానోపాధ్యాయురాలు జానకి, సూపర్‌వైజర్ రామచంద్ర, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

నాగారం : మండల పరిధిలోని పసునూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. గణిత ఉపాధ్యాయుడు ఎర్ర హరికిషన్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు బత్తిని విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, సైదులు, శివకుమార్, శోభారాణి, కళమ్మ, వెంకన్న, శ్రీదేవి, జిలాని, భాస్కరాచారి పాల్గొన్నారు.

మారని రోడ్లు.. తప్పని ఇబ్బందులు

- గుంతలమయంగా రాజగానితండా– కుక్కడం రోడ్డు
- వర్షాకాలంలో బురదమయం కావడంతో ప్రయాణికులకు తిప్పలు
- బీటీ రోడ్డు కోసం ఎదురుచూపు



బురదమయంగా మారిన కుక్కడం - రాజగానితండా రోడ్డు

మద్దిరాల : ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా కొన్ని గ్రామాలకు, తండాలకు వెళ్లే లింకు రోడ్లు మాత్రం ఇంకా మట్టి రోడ్లుగానే దర్శనమిస్తున్నాయి. ఈ మట్టి రోడ్లలో ప్రయాణాలు సాగించాలంటే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండల పరిధిలోని కుక్కడం ఆవాసం రాజగానితండాకు వెళ్లే మట్టిరోడ్డు సమస్య కూడా అలాంటిదే. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే తండా వాసులు, కుక్కడం ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ మట్టి రోడ్డు ఎప్పుడు బీటీ రోడ్డుగా మారుతుందోనని ఎంతోకాలంగా నిరీక్షిస్తున్నారు. గుంతలమయంగా మారిన ఈ దారుల్లో ప్రయాణించలేక పడరాని పాట్లు పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో నరకం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా తమ బతుకుల్లో మార్పు రావడం లేదని తండా వాసులు వాపోతున్నారు. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు, విద్యార్థులు, వృద్ధులు ఈ మట్టిరోడ్డు గుండా వెళ్లాలంటే మరో వ్యక్తి సహాయం తప్పనిసరి అవుతుంది. రోడ్డు మొత్తం చిత్తడిగా మారి ద్విచక్ర వాహనదారులు, ఆటోల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. గతంలో బురదమయంగా మారిన ఈ మట్టిరోడ్డు గుండా వెళ్తూ చాలా మంది ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. కుక్కడం గ్రామం నుంచి రాజగానితండా, మానపురం, రావులపల్లి, హరిపిరాల, తొర్రూర్ వెళ్లాలంటే ఈ రోడ్డులో ప్రయాణిస్తే తక్కువ దూరం అవుతుంది. అయితే వర్షాకాలంలో రోడ్డు మొత్తం బురదమయంగా మారి నడవడానికి కూడా వీలు లేకుండా ఉండడంతో పాటు వాహనాలు అదుపుతప్పుతున్నాయి.

పాలకుల నిరాదరణ..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో పలుమార్లు తండాకు బీటీ రోడ్డు వేయాలని విన్నవించినా పట్టించుకోలేదని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితేనైనా తమ సమస్య పరిష్కారమవుతుందని ఆశపడితే, ఈ ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు కావస్తున్నా బీటీ రోడ్డు ఊసే లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, తక్షణమే ఈ మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చి తమ కష్టాలను తీర్చాలని రాజగానితండా, కుక్కడం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

బీటీరోడ్డుగా మార్చాలి



ఎక్కడైనా రవాణా సౌకర్యం బాగున్నప్పుడే ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. కానీ మా తండాకు మా తాతలు, ముత్తాతల నుంచి ఉన్న మట్టిరోడ్డుపైనే మా బతుకులు వెళ్లదీస్తున్నాం. వానొస్తే రోడ్డు చిత్తడిమయంగా మారి ప్రయాణించాలంటే నరక యాతనే. తమను పట్టించుకునే వారు ఎవరు లేకుండాపోయారు. ఇప్పటికైనా మా తండాకు బీటీరోడ్డు వేసి సమస్య పరిష్కరించాలి.

– లకావత్ సోమ్లా, రాజగానితండా

వర్షాకాలంలో నానా ఇబ్బందులు



వర్షకాలంలో ఈ రోడ్డలో ప్రయాణించాలంటే నానా ఇబ్బందులు పడాల్సివస్తుంది. రోడ్డు మొత్తం బురదమయంగా మారి ద్విచక్రవాహనాల పైనుంచి కిందపడుతున్నాం. ముఖ్యంగా రాత్రి సమయంలో ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తే ఈ రోడ్డు గుండా ప్రయాణించడం చాలా ఇబ్బందిగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి కుక్కడం నుంచి మా తండా మీదుగా మానపురం వరకు బీటీరోడ్డు వేయాలి.

– బానోత్ బాలాజీ, రాజగానితండా

ఆయిల్‌పామ్ సాగుకు దరఖాస్తు చేసుకోవాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : నీటి వసతి ఉండి ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులు దరఖాస్తు చేసుకోవాలని పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీ జూనియర్ మేనేజర్ శశికుమార్ కోరారు. మంగళవారం తిరుమలగిరి మండలంలోని మాలిపురం గ్రామంలో సాగవుతున్న ఆయిల్‌పామ్ తోటలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్ఎంఈఓపీ పథకంలో భాగంగా ఉద్యాన శాఖ ద్వారా రైతులకు మొక్కలు, డ్రిప్‌కు సబ్సిడీ, తోట యాజమాన్యం, అంతర్ పంటల సాగుకు ఎకరాకు రూ.4200 చొప్పున 4 సంవత్సరాలపాటు జమ చేస్తారని చెప్పారు. రైతుకు ఒక ఎకరానికి రూ.50,918 రాయితీ అందజేస్తామన్నారు. ఆయన వెంట క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, నాగరాజు, రైతులు ఏడుదొడ్ల మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ మేనేజర్ శశికుమార్

పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ హనుమంత రెడ్డి

సూర్యాపేట అర్బన్ : ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధుల నివారణ సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ హనుమంత రెడ్డి అన్నారు. మంగళవారం 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సూర్యాపేట పట్టణంలోని 38వ వార్డులో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో మున్సిపల్ డీఈ సత్యారావు, సానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, టీఎంసీ శ్వేత పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట అర్బన్ : వీధి వ్యాపారులు బ్యాంకుల ద్వారా వచ్చే రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ హనుమంత రెడ్డి అన్నారు. మంగళవారం స్ట్రీట్ వెండర్స్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్ట్రీట్ వెండర్స్‌ను అందరినీ కలుపుకుని సీఐజీ గ్రూప్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ శ్వేత, సీఈఓలు రోజా సువర్ణ, పాపమ్మ, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, ఆర్పీలు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సభ విజయవంతం

- ఎమ్మెల్యే మందుల సామేల్



తిరుమలగిరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : నూతన రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా తిరుమలగిరిలో జరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభ విజయవంతమైందని, ఇందుకు కృషి చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానికంగా ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో 10 సంవత్సరాల పాటు నియోజకవర్గంలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు రాలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు మాజీ మంత్రి జగదీష్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు లేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. రానున్న గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తారని తెలిపారు. బహిరంగ సభ విజయవంతం అవడంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నూతనకల్ మార్కెట్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు ఎల్సోజు నరేష్, నాగం సుధాకర్ రెడ్డి, గోవర్ధన్, జోజి, మూల అశోక్‌రెడ్డి, పాలెపు చంద్రశేఖర్, కందుకూరి లక్ష్మయ్య, వంగాల దానయ్య, జమ్మిలాల్, అబ్బాస్, సతీష్ పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలి



సూర్యాపేటలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

సూర్యాపేటటౌన్ : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై ఏకరువు పెడుతున్న జగదీష్‌పై అక్కసు వెళ్లగక్కడానికే సీఎం రేవంత్‌రెడ్డి తిరుమలగిరి వచ్చారని విమర్శించారు. కాళేశ్వరం జలాలను విడుదల చేసి రైతుల కళ్లలో ఆనందం నింపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడడానికే సభ

సూర్యాపేట : మాజీ మంత్రి జగదీష్ రెడ్డికి సీఎం క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జీడీ భిక్షం డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ముఖ్యమంత్రులు పర్యటనలు చేస్తే జిల్లా, నియోజకవర్గానికి నిధులు కేటాయించేవారని ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి మాత్రం ఇష్టానుసారంగా మాట్లాడటం కోసమే సభ నిర్వహించారని ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎంపీటీసీ మామిడి కిరణ్ కుమార్, మాజీ సర్పంచ్‌లు చింతలపాటి మధు, కాటసాని వెంకట్ రెడ్డి, లునావత్ అశోక్, అనంతుల వాసుదేవరెడ్డి పాల్గొన్నారు .

వ్యక్తిగత విమర్శలు చేయడం తగదు

పెన్‌పహాడ్‌: అభివృద్ధిలో ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో ముందుంచిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులను విమర్శిస్తే ప్రజలు చేతుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో దంతాల వెంకన్న, పాదిల నాగార్జున, చిట్టెపు నారాయణరెడ్డి, దాసరి శ్రీనివాస్, బాదె ధర్మయ్య, దాచేపల్లి సుధాకర్, నెమ్మాది నగేష్, మేకల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

సూర్యాపేట అర్బన్ : ఇల్లందు పట్టణంలో బుధవారం నిర్వహించే సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ కేంద్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ ప్రథమ వర్ధంతి సభను, స్థూపం ఆవిష్కరణను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక పిలుపునిచ్చారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని కుడకుడ లెనిన్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సభకు ముఖ్య వక్తలుగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ ఆల్ ఇండియా కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు మరియు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పట్టణ కార్యదర్శి గులాం హుస్సేన్, డివిజన్ నాయకులు ఎస్కే. సయ్యద్, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రేణుక, సహాయ కార్యదర్శి సంతోషి మాత, కోశాధికారి మోటకట్ల జయమ్మ, టియుసీఐ నాయకులు మోహన్, శంకర్, గౌరమ్మ, అనసూర్య, పద్మ, ధనలక్ష్మి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

పక్కా భవనాలకు నిధుల మంజూరు హర్షణీయం

నాగారం : తిరుమలగిరి మండల కేంద్రంలో సోమవారం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాగారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు మంజూరు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కడారి యాదవరెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.3.75 కోట్లతో తహసీల్దార్ కార్యాలయం, రూ.4కోట్లతో మండల పరిషత్ కార్యాలయం, రూ.3.50కోట్లతో పోలీస్‌స్టేషన్‌కు పక్కా భవనాలు మంజూరు చేయడంతో ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జాజుల వీరయ్య, కడారి సోమయ్య, మంగదుడ్ల దశరథ, చిప్పలపల్లి మల్సూర్, డి.చంద్రశేఖర్, ఆకారపు కిష్టయ్య, పేరం రాంబాబు, లింగయ్య, కడారి రమేష్, కొమ్ము యాకస్వామి, శివ, జయరాజ్, గౌతం తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం వికసించడానికి చదువు ఎంతో అవసరం



విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేస్తున్న ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీరామ్ వెంకట్

పెన్‌పహాడ్‌: విద్యార్థుల్లో విజ్ఞానం వికసించడానికి చదువు ఎంతో అవసరమని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, విభిన్న పాత్రాభినయ కళాకారుడు, పర్యావరణవేత్త పెండెం కృష్ణకుమార్ అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని దోసపహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలకు జాతీయ నాయకుల చిత్రపటాలు, ఆట వస్తువులు, వాటర్‌క్యాన్, మెడికల్ కిట్, క్లాత్ సంచులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జ్ఞానాన్ని సంపాదించడంతోపాటు, దేశభక్తిని పెంచుకొని భవిష్యత్‌లో గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పిండిగ నరసయ్య, ఉపాధ్యాయులు మామిడి వెంకన్న, కళ్యాణి, విజయ్‌కుమారి, వెంకన్న, విప్లవకుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగులు, నోట్‌బుక్స్ అందజేత

మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆశాజ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీరామ్ వెంకట్ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో బొలిశెట్టి సత్యం, సలిగంటి నాగయ్య, సముద్రాల శ్రీనివాస్, శ్రీరామ్ శ్రీనివాస్, బిట్టు వెంకన్న, భూక్య సందీప్‌రాథోడ్, సముద్రాల పవన్, మామిడి కరుణాకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి




సభ్యత్వం అందజేస్తున్న తంగెళ్ల జితేందర్‌రెడ్డి

పెన్‌పహాడ్‌: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ టీఎస్ కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని భక్తాళాపురం, గాజులమల్కాపురం, లింగాల, అనాజీపురం మోడల్ స్కూల్, కేజీబీవీ, పెన్‌పహాడ్ తదితర పాఠశాలల్లో మండల అధ్యక్ష, కార్యదర్శులు సంద్యాల వినోద్, నల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ నకిరేకంటి రవి, కందుకూరి శివశంకర్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ నెమ్మని వెంకటేశ్వర్లు, తస్నీరు ప్రమీల, యరగాని లింగయ్య, మేకల రాజశేఖర్, రాచూరి కృష్ణయ్య, సత్యనారాయణ, బొమ్మిడి కృష్ణయ్య, నాగయ్య, శ్రీపాద ఉపేందర్, మహబూబ్‌అలీ, వెంకటేశ్వర్లు, హనుమంతు, ధనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

అర్వపల్లి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్ర వ్యాప్త పాఠశాలలు, జూనియర్ కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. మంగళవారం జాజిరెడ్డిగూడెంలో బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలన్నారు. గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, విద్యార్థులకు ఉచిత బస్‌పాసులను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి



ధర్నా చేస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని నిమ్మ తనూష మహాలక్ష్మి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దనియాకుల శ్రీకాంత్‌వర్మ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా హాస్పిటల్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా.. అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. విద్యార్థిని మృతిపై అనేక అనుమానాలున్నాయన్నారు. పోలీస్ విచారణ జరుగుతుండగా, పోస్టుమార్టం రిపోర్ట్ రాకముందే కుటుంబ తగాదాలతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందని డీఈఓ మీడియాకు, సోషల్ మీడియాలో ప్రకటించడం సరైంది కాదన్నారు. తప్పుడు ప్రచారం చేసిన డీఈఓను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యాతకుల ప్రవీణ్, పులుసు శ్రవణ్ కుమార్, శివ, గణేష్, పిడమర్తి భరత్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కమిటీ ఎన్నిక

తుంగతుర్తి : తుంగతుర్తి లయన్స్ క్లబ్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పాలవరపు సంతోష్, ప్రధాన కార్యదర్శిగా పులుసు వెంకటనారాయణ, కోశాధికారిగా గుండగాని రాములు, ఉపాధ్యక్షుడిగా తల్లాడ కేదారి, కార్యదర్శిగా గిరి, కోఆర్డినేటర్లుగా శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, యాదగిరి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, ప్రభాకర్ రెడ్డి, ప్రభాకర్ రావు, గోపాల్, సతీష్ కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

వసతి గృహం పరిశీలన

అర్వపల్లి: అర్వపల్లిలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర డైరెక్టర్, స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు కోటమర్తి వీరన్న మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వారితో కలిసి అల్పాహారం చేశారు. వసతి గృహంలో అన్ని వసతులు ఉన్నాయని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలవుతుందని తెలిపారు.

హామీలు అమలు చేయలేక ప్రతిపక్షాలపై ఆరోపణలు

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రతిపక్ష నేతలపై ముఖ్యమంత్రి అసత్య ఆరోపణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోడి నరసింహారావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నెమ్మికల్లు గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలగిరి బహిరంగ సభలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డిని తులసి వనంలో గంజాయి మొక్కగా అభివర్ణించడాన్ని బీఆర్‌ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రాజకీయ ప్రసంగం చేయడం సరికాదన్నారు. పది సంవత్సరాలు మంత్రిగా పనిచేసి సూర్యాపేట జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత జగదీశ్ రెడ్డిదన్నారు. ఇలాంటి ఆరోపణలు చేస్తే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కొనతం సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మొత్తం కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రసాద్, దండుమైసమ్మ మాజీ చైర్మన్ బెల్లంకొండ యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు మర్ల చంద్రారెడ్డి, కసగాని బ్రహ్మం, మిర్యాల వెంకటరెడ్డి, గుణగంటి భిక్షం, తిరుమలేష్, రంగారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

సూర్యాపేట : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని తెలంగాణ విద్యార్థి జనసమితి జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని వినయ్ గౌడ్ అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి జనసమితి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారిలో పాలగాని వేణు గౌడ్, మహేష్, నవీన్, గణేష్ తదితరులు ఉన్నారు.

జీవాలకు బ్లూటంగ్ టీకాలు సరఫరా చేయాలి

అర్వపల్లి : జీవాలకు బ్లూటంగ్ టీకాలు అందుబాటులో లేక పెంపకందారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, టీకాలను పెంపకందారులకు సరఫరా చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం రామన్నగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీకాలు అందుబాటులో లేక కొంతమంది పశువైద్య సిబ్బంది బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఒక్కో టీకా రూ.600కు పైగానే తీసుకుంటున్నారని విమర్శించారు. వ్యాక్సిన్‌ను పశువైద్యశాలలో అందుబాటులో ఉంచాలని కోరారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

తిరుమలగిరి (తుంగతుర్తి) : బూత్ స్థాయి అధికారులకు మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిప్రసాద్ మాట్లాడుతూ ఓటరు జాబితాలో డబుల్ పేర్లు, చనిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కె.జాన్‌మహ్మద్, మాస్టర్ ట్రైనర్ అశోక్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

అర్వపల్లి: ఎస్సీ గురుకుల విద్యాలయాలు, కళాశాలల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం(పీపీఎల్) రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ నర్సయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ గురుకుల విద్యాలయాలు, కళాశాలల్లో ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీ చేయడం లేదన్నారు. జ్వరాల బారిన పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నూతనకల్: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య అన్నారు. మంగళవారం నూతనకల్ మండలంలోని వివిధ పాఠశాలల్లో తపస్ మండల శాఖ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు పర్వతం సంధ్యారాణి, నాయకులు యమా సంతోష్, మన్నె శ్రీదేవి, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి నాగవల్లి దళార్చన

అర్వపల్లి: తిమ్మాపురం సూర్యక్షేత్రం ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్ దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి నాగవల్లి దళాలతో సహస్ర నామార్చన చేశారు. పంచామృతం, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్తపారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుండా యాదగిరి, ప్రభాకర్, దేవరశెట్టి వెంకటేశ్వర్లు, హరినాథ్‌గుప్త, తిరుపతయ్య, అర్చకులు బీంపాండే, మోనూపాండే, శ్రీరాంపాండే, భక్తులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన

చివ్వెంల(సూర్యాపేట) : హెచ్‌ఐవీ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంతోష్ కుమార్ అన్నారు. చివ్వెంలలో మంగళవారం సంపూర్ణ సురక్ష కేంద్రం సూర్యాపేట ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్నారు. వ్యాధిబారిన పడిన వారిని సంపూర్ణ సురక్ష కేంద్రానికి పంపించాలన్నారు. కార్యక్రమంలో సురక్ష కేంద్ర మేనేజర్ నరేష్, వైద్యాధికారి భవాని, ఎంపీఓ దయాకర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సునీత పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం

అర్వపల్లి: క్షయ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే వైద్యం ద్వారా పూర్తిగా నయం చేయొచ్చని మండల వైద్యాధికారి నగేష్‌నాయక్ అన్నారు. మంగళవారం పడమటితండాలో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి టీబీ పరీక్షలు నిర్వహించారు. ఎవరికైనా క్షయ లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే స్థానిక వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ నివారణ నోడల్ పర్సన్ కుంభం వీరయ్య, ఎల్‌టీ చొక్కయ్య, ఎంఎల్‌హెచ్‌పీ గౌతమి, హెల్త్‌అసిస్టెంట్‌లు నాగరాణి, శ్వేత, ఆశా కార్యకర్త శాంతి తండా గిరిజనులు పాల్గొన్నారు.